ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి



రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
మంగళవారం 6 మే 2025



తప్పని ఎదురు చూపులు..

- అందని రిటైర్‌మెంట్ బెనిఫిట్స్
- విశ్రాంత అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల నిరీక్షణ
- జిల్లాలో 37 మంది టీచర్లు, 201 ఆయాల పదవీ విరమణ

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)
చాలీచాలని వేతనాలతో గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం, చిన్నారులకు పూర్వ విద్యను అందించిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. తమ డిమాండ్ల సాధనకు అనేక సంవత్సరాలుగా పోరాటాలు చేశారు. ఫలితంగా ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌ను ప్రకటించారు. గత సంవత్సరం మహిళా శిశు సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ 1334 మోమోను జారీ చేశారు. 2024 ఏప్రిల్ 30 నాటికి 65 సంవత్సరాలు నిండిన వారిని విధుల్లో నుంచి తొలగిస్తూ పదవీ విరమణ ప్రకటించారు. దీంతో రాజన్న సిరిసిల్ల జిల్లాలో 27 మంది టీచర్లు 198 మంది ఆయాలు విధులకు దూరమయ్యారు. ప్రస్తుతం 2025 సంవత్సరంలో మరో 10 మంది టీచర్లు, ముగ్గురు ఆయాలు పదవీ విరమణ పొందారు. దీంతో జిల్లాలో పదవీ విరమణ పొందిన వారి సంఖ్య 37 మంది టీచర్లు, 201 మంది ఆయాలకు చేరుకుంది. ఏళ్ల తరబడి తక్కువ వేతనాలతో విధులు నిర్వహించిన అంగన్‌వాడీ టీచర్లు రూ.13,650, సహాయకులు రూ 6,700 మాత్రమే వేతనం పొందుతూ పదవీ విరమణ పొందారు. పదవీ విరమణ పొందిన వీరు తమకు రావాల్సిన బెనిఫిట్స్ కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.

జిల్లాలో 587 అంగన్‌వాడీ కేంద్రాలు..

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 587 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. విశ్రాంత అంగన్‌వాడీ టీచర్లు, అయాలు ఉద్యోగాలు కోల్పోయి. ప్రభు త్వం ఇస్తామన్న బెనిఫిట్స్ అందక ఆర్థిక ఇబ్బందులకు గురవు తున్నారు. తొమ్మిది నెలలుగా పదవీ విరమణ పొందిన 37 మంది టీచర్లు, అయాలు బెనిఫిట్స్ ఎప్పుడు ఇస్తారని ప్రశ్నిస్తున్నారు. జిల్లాలో ఉద్యోగ విరమణ పొందిన 37 మంది టీచర్లకు రూ. లక్ష చొప్పున రూ .37 లక్షలు, 201 మంది ఆయాలకు రూ. 50 వేల చొప్పున రూ. కోటి 50 వేలు బెనిఫిట్స్ రావాల్సి ఉంది. బెనిఫిట్స్ కోసం తిరుగుతున్న విశ్రాంత టీచర్లు, అయాలు మళ్లీ ఆందోళన బాటకు సిద్ధమవుతున్నారు.

భర్తీ కాని ఖాళీలు

43 టీచర్లు, 174 ఆయాల పోస్టుల ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ సిద్ధం చేసినా నిరుద్యోగ మహిళలకు నిరీక్షణే మిగిలింది. సిరిసిల్ల ప్రాజెక్ట్ పరిధిలో 362 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 30 టీచర్లు, 105 ఆయా పోస్టులు, వేములవాడ ప్రాజెక్ట్ పరిధిలో 225 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 13 టీచర్లు, 69 ఆయాల పోస్టుల భర్తీకి ఏర్పాట్లు చేశారు. నోటిఫికేషన్ రాకపోవడంతో జిల్లాలో ఖాళీల సంఖ్య భారీగా పెరిగింది. ఇన్‌చార్జీలతో అంగన్‌వాడీ కేంద్రా లు నడపడంలో ఇబ్బందులు పడుతున్నారు. 587 అంగన్‌వాడీ కేంద్రాల్లో 43వేల మంది లాభోక్తులు ఉన్నారు. అరోగ్య లక్ష్మీ ద్వారా 18,644 మందికి పౌష్టికాహారం, 6 నెలల నుంచి 3 సంవత్సరాల చిన్నారులకు బాలామృతంతో పాటు 16 కోడి గుడ్లు హోం రేషన్ అందిస్తున్నారు. 15,804 మంది చిన్నారులకు ఒక్కపూట సంపూర్ణ భోజనం, గుడ్డు, పాలు, అందిస్తున్నారు. టీచర్లు, అయాల ఖాళీలతో పౌష్టికాహార కేంద్రాలుగా ఉన్నా అంగన్‌వాడీల్లో ఖాళీలతో సిబ్బంది సమస్యలు ఎదుర్కొంటున్నారు.

నేడు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి పర్యటన

ఎల్లారెడ్డిపేట, మేన్(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి గ్రామంలో ఈ నెల 6న జరిగే పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ హాజరు కానున్నారని పార్టీ నాయకులు సోమవారం తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చేరుకుంటారని పేర్కొన్నారు. అనంతరం ఉత్సవాల్లో పాల్గొననున్నారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

● గంభీరావుపేట: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ గంభీరావుపేట మండలం నర్మాలలో మంగళవారం పర్యటించనున్నట్లు బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు గంట అశోక్ తెలిపారు. నర్మాలలో శ్రీ మడలేశ్వరస్వామి విగ్రహప్రతిష్ఠాపన ఉత్సవాల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులతో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

ఎల్లారెడ్డిపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులను కలెక్టర్ సందీప్ కుమార్‌ఝా, ఎస్పీ మహేశ్ బి గీతేలు సోమవారం అభినందించారని పాఠశాల హెచ్‌ఎం మురళీధర్ తెలిపారు. భవిష్యత్తు మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు



ప్రచారం నిర్వహిస్తున్న అధ్యాపకులు

ఎల్లారెడ్డిపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు నారాయణపూర్, సింగారం, బండలింగంపల్లి తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాల ఉపాధ్యాయులు, అధ్యాపకులు సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లోని వసతులు, విద్యా బోధన, సర్కారు అందిస్తున్న పథకాలను వివరించారు. తమ పిల్లలను విద్యా సంస్థల్లో చేర్పించి వారి ఉన్నతికి పాటు పడాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో సామాజిక తనిఖీ చేయాలి



సామాజిక తనిఖీ చేస్తున్న అధికారులు

వీర్నపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జరిగిన పనులకు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో సామాజిక తనిఖీ చేయడం జరుగుతుందని జిల్లా విజిలెన్స్ అధికారి రామారావు అన్నారు. వీర్నపల్లి మండలకేంద్రంలోని ఈజీఎస్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో సోమవారం సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాల్లో చేసిన పనులపై రికార్డులను పరిశీలించి తనిఖీలు నిర్వహించాలన్నారు. అనంతరం గ్రామస్థాయిలో గ్రామసభలు నిర్వహించి ఉపాధిహామీలో చేసిన పనులపై ప్రజలతో చర్చించాలన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో 2024- 2025 ఆర్థిక సంవత్సరంలో రూ 7 కోట్ల 6 లక్షల పనులు చేపట్టినట్లు అధికారులు పేర్కొన్నారు. సమావేశంలో అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి తరుణ్ కుమార్, సామాజిక తనిఖీ రిసోర్స్ పర్సన్ బాలు, ఏపీఓ శ్రీహరి, సాంకేతిక సహాయకులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన అంబేద్కర్ సంఘు నాయకులు



ఎమ్మెల్యేను కలిసిన అంబేద్కర్ సంఘు నాయకులు

ఇల్లంతకుంట, మే 5(ఆంధ్రజ్యోతి) మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామ అంబేద్కర్ సంఘ నాయకులు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణను కలిశారు. మానకొండూర్ నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం నాయకులు కలిసి సంఘ అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరారు. అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రమణారెడ్డి, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి నవీన్‌రెడ్డి, అంబేద్కర్ సంఘ అధ్యక్షుడు పసుల నరేష్, సంఘ నాయకులు బట్టు అనీల్, పసుల బాలరాజు, కేశవులు, లచ్చయ్య, గొడిశెల రజనీకాంత్ ఉన్నారు.

సన్న ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వం స్పందించాలి

● బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య



సిరిసిల్లలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట అగయ్య

సిరిసిల్ల రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఆరుగాలం కష్టించి పండించిన సన్నరకం ధాన్యంను రైస్‌మిల్లర్లు తీసుకోమని ప్రకటించారని దీంతో సన్నరకం పండించిన రైతులు ధాన్యం విక్రయించు కునేందుకు ఇబ్బందులు పడుతున్నారని దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి స్పష్టత ఇవ్వాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట అగయ్య డిమాండ్ చేశారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడు తూ రైతు పండించిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం నేటి వరకు సన్నధాన్యం కొనుగోలుపై ఎలాంటి ప్రకటన చేయకపోవడం శోచనీయమని అన్నారు. 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామన్న ప్రభు త్వం ఆ లక్ష్యానికి చేరుకోకపోగా కొనుగోలు చేసిన ధాన్యాన్ని కూడా రైతులకు డబ్బులు ఇవ్వడం లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొను గోలు కేంద్రాల వద్ద తూకాలు వేసి ఎలాంటి మోసా లు జరగకుండా, రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేసిన వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో క్వింటాలుకు 2 కిలోల తరుగు తీస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభు త్వం స్పందించి సన్న ధాన్యంతో పాటు ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని లేకుంటే అందోళన చేపడుతామని అన్నారు. ఈ సమావేశంలో మాజీ జడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, పట్టణ ఉపాధ్యక్షుడు ఎండీ సత్తార్, తంగళ్లపల్లి మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, ఎల్లారెడ్డిపేట సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి, వెంగళ శ్రీనివాస్, కుంభాల మల్లారెడ్డి, మాట్ల మధు, ప్రేమ్ సాగర్, బండి జగన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభల ద్వారా ఇందిరమ్మ ఇళ్లు ఎంపిక చేయాలి



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న వ్యవసాయ కార్మిక సంఘు కార్యదర్శి

ఇల్లంతకుంట, మే 5 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక గ్రామసభల ద్వారా జరుగాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ కార్యదర్శి గన్నారం నర్సయ్య పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీఓ శశికళను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం ఇందిరమ్మ కమిటీల ద్వారా ఎంపిక చేయడం వల్ల అర్హుల పేర్లు జాబితాలో కనిపించడం లేదన్నారు. నిరుపేదలకు ఇళ్లు రాకుండా ఎకరాల భూమి ఉన్నవారికి ఇళ్లు వస్తున్నాయన్నారు. ఆన్‌లైన్ ద్వారా ఎంపిక చేశామని అధికారులు పేర్కొంటున్నారని, నిరుపేదల పేర్లు ఆన్‌లైన్‌లో ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. అధికారులు రాజకీయాలకు అతీతంగా వ్యవహరించి నిరుపేద ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్లను ఇష్టానుసారంగా కేటాయిస్తే నిరుపేద ప్రజలతో కలిసి ఉద్యమిస్తామని పేర్కొన్నారు.

బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

● ఎస్పీ మహేశ్ బి. గీతే



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ మహేశ్ బి. గీతే

సిరిసిల్ల క్రైం, మే 5(ఆంధ్రజ్యోతి): బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యమని ఎస్పీ మహేశ్ బి. గీతే అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో 32 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి బాధితులకు సత్వర న్యాయం చేయడానికి గ్రీవెన్స్‌డే ఉపయోగ పడుతుందన్నారు. అర్జీదారులనుండి ఫిర్యాదులు స్వీకరించి ఆయా పోలీస్ స్టేషన్‌ల ఎస్‌హెచ్‌ఓలకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్ట పరంగా త్వరితగతిన పరిష్కారించాలని ఆదేశించామన్నారు. ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషిచేయడం జరుగుతుందన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి వినతులు, ఫిర్యాదులు స్వీకరించి అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదు దారునికి పోలీస్‌శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్‌డేలో వచ్చిన ఫిర్యాదులు ఆన్‌లైన్‌లో పొందుపరస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలు అందించడం జరుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలు అధికారుల దృష్టికి తీసుకు రావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామన్నారు.

నర్మాలలో మడలేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

గంభీరావుపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం నర్మాలలో స్థానిక రజక సంఘం ఆధ్వర్యంలో శ్రీ మ డలేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహో త్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ మహోత్సవానికి నాఫ్స్‌కాప్ చైర్మన్ కొం డూరు రవీందర్‌రావు, బీఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గూడూరు ప్రవీణ్‌లు విచ్చేసి, ప్రత్యేక పూజలు చేశారు. వారితో పాటు బీఆర్ఎస్ మండలశాఖ అధ్యక్షుడు వెంకటస్వామి, సెస్ డైరెక్టర్ నారాయణరావు, నాయకులు రాజేందర్ తదితరులుతో పాటు పార్టీ నాయకులు ఉన్నారు.

ఆర్టీసీ జేఏసీ కమిటీ ఎన్నిక



సిరిసిల్ల ఆర్టీసీ డీపో ఎదుట సమ్మె పోస్టర్ ఆవిష్కరిస్తున్న జేఏసీ నాయకులు

సిరిసిల్ల రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల డిపోలో అన్ని కేటగిరీల ఉద్యోగుల సమక్షంలో సమ్మె విషయమై చర్చించి జేఏసీ కమిటీని సోమ వారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సిరిస్లిల డిపో ఎదుట సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. జేఏసీ చైర్మన్‌గా ముద్రకోల లక్ష్మణ్, వైస్ చైర్మన్‌లుగా సీహెచ్ బానయ్య, నర్సింహులు, జేఏఎస్‌ఎన్‌రావు, రాజేందర్, లక్ష్మణ్, సునీత, ఉమ, కరుణ, లకావత్ రాంరెడ్డి, దేవయ్య, రవి, రమేష్, ఎంపీకుమార్, తిరుపతి, మోహన్, ప్రకాష్, జేఏసీ ప్రచార కమిటీ కన్వీనర్లుగా నర్సయ్య, ప్రసాద్, ముత్యం, సంతోష్, శ్రీనివాస్, సభ్యులుగా భాస్కర్, ఐటీ కుమార్, శ్రీనివాస్, నర్సయ్య, తిరుపతి, శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు.

రైతులు నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి

ఇల్లంతకుంట, మే 5 (ఆంధ్రజ్యోతి): నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడటానికి రైతులు ప్రయత్నించాలని జిల్లా వ్యవసాయాధికారిణి అఫ్జల్‌బేగం పేర్కొన్నారు. మండలంలోని పొత్తూరు గ్రామంలోని రైతువేదికలో సోమవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెల రోజుల పాటు జిల్లాలోని వివిధ గ్రామాల్లో కార్యక్రమాలు ఉన్నందున రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచుకోవడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. రైతులు అవసరం మేరకు మాత్రమే రసాయనాలు వినియోగించాలని, యూరియా వాడకం తగ్గించడం ద్వారా సాగు ఖర్చు తగ్గుతుందన్నారు. సమగ్ర నీటి యాజమాన్య పద్ధతులను వినియోగించాలని సూచించారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసినపుడు రసీదులను భద్రపర్చకోవాలని, కష్టకాలంలో నష్టపరిహారాన్ని పొందవచ్చన్నారు. సమావేశంలో వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ సునీతాదేవి, ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ మదన్‌మోహన్‌రెడ్డి, వ్యవసాయ పరిశోధన స్థానం డీన్ ఉషారాణి, వ్యవసాయ శాస్త్రవేత్తలు విజయభాస్కర్, శ్రావణి, రాజేంద్రప్రసాద్, మండల వ్యవసాయాధికారి సురేష్ రెడ్డి, ఏఈఓలు లలిత, అర్చన, జ్యోతి, రవళి, గంగ, అర్చన, అభిషేక్‌లతో పాటు రైతులు పాల్గొన్నారు.

కోర్టులకు నెల రోజులు వేసవి సెలవులు

సిరిసిల్ల క్రైం, మే 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ కోర్టులకు నెలరోజులు వేసవి సెలవులు(సివిల్ వెకేషన్) ప్రకటించారు. సోమవారం నుంచి జూన్ 6వరకు జిల్లా కోర్టులు, సీనియర్ సివిల్ కోర్టు లకు, జూనియర్ సివిల్ కోర్టులకు ఈ నెల 10నుంచి జూన్ 6వరకు సెల వులు ప్రకటిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పీ. నీరజ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే హైకోర్టుకు ఈ నెల 3నుంచి జూన్ 6వరకు సెలవులు ప్రకటించారు. ఎవరైనా సివిల్, క్రిమినల్ కేసుల్లో దావా వేయాలనుకుంటే ఇన్‌చార్జి న్యాయమూర్తి ఆధ్వర్యంలో కోర్టులు కొనసాగుతాయి.

నేటి నుంచి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

గంభీరావుపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి గ్రామంలో మంగళవారం నుంచి వేణుగోపాలస్వామి ఆలయ బ్రహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 6న మంగళవారం నుంచి 13 మంగళవారం వరకు శ్రీ వేణుగోపాలస్వామి బ్రహోత్సవాలు కొనసాగనున్నాయి. బ్రహోత్సవాల్లో బాగంగా 10న శనివారం మంగళధ్వని సుప్రభాతం, భగవతారాదన, బాలభోగం, తీర్థగోష్టి, యాగశాల ప్రవేశం, చతుస్థానార్చన, నిత్య హోమం, బలిహరణం, పల్లకి సేవ, అమ్మవారికి ఓడిబియ్యం, విష్ణుసహస్ర పారాయణం, సాయం నిత్యహోమం, బలిహరణం, గజవాహనం, పెద్దసేవ అరగింపు, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు జరగనున్నాయి. 11న ఆదివారం పల్లకిసేవ, శ్రీ లక్ష్మీనర్సింహ సుదర్శన హోమం, హనుమంత వాహన పెద్దసేవ కార్యక్రమాలు కొనసాగనున్నాయి.

నకిలీ మందులు అమ్ముతున్న వ్యక్తిని పట్టుకున్న గ్రామస్థులు

కాల్వశ్రీరాంపూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆశన్నపల్లె గ్రామపంచాయతీ కార్యాలయంలో నకిలీ మందులు అమ్ముతున్న కొంకటి రమేష్ అనే వ్యక్తిని సోమవారం గ్రామస్థులు పటుకున్నారు. ఈ విషయంపై మెడికల్ సిబ్బందికి సమాచారం అందించగా కూనారం ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భావన ఆశన్నపల్లెలో మందులు పరిశీలించారు.డాక్టర్ భావన మాట్లాడుతూ ఆశన్నపల్లి గ్రామపంచాయతీలో సంజీవని నేషనల్‌కేర్ సెంటర్‌కు సంబంధించిన కొంకటి రమేష్ ఎక్స్‌పైరీ అయిపోయిన మందులను గ్రామస్థులకు అమ్ముతున్నాడని తెలిపారు. ఈ మందులు వాడటం వల్ల సైడ్‌ఎఫెక్ట్స్ కూడా ఉంటాయన్నారు.

గ్రామ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి..

గ్రామకార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని మాజీసర్పంచ్ మంద రమ వెంకన్న, గాజుల మోహన్, కూస రవి, ఎరుకల మల్లయ్య తదితరులు డాక్టర్‌కు వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యదర్శి సంజీవ్ గ్రామంలో ఊరు చాటింపు వేయించి గ్రామపంచాయతీలోనే మెడికల్ క్యాంపు నిర్వహించిన కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈమందులు ఇచ్చే అతను పరీక్షలకు 200రూపాయలు, మందులకు 1000 నుంచి 1200రూపాయలు వసూలు చేశాడని ఈవిషయంపై జిల్లా కలెక్టర్ స్పందించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వేములవాడ టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ, బస్సు ద్విచక్ర వాహం ఢీకొన్న సంఘటనలో ఒకవ్యక్తి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలప్రకారం.. కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామానికి చెందిన రాజు తన ద్విచక్రవాహనంపై సిరిసిల్లకు వెళుతుండగా డివైడర్‌ను ఢీకొని ఎదురుగా సిరిసిల్ల నుంచి వేములవాడకు వస్తున్న బస్సుకు ఢీకొన్నాడు. ఈ సంఘటనలో రాజుకు తీవ్రగాయాలు కావడంతో కరీంనగర్ ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష

జగిత్యాల అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల కేంద్రంలో కొన్ని రోజుల క్రితం పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వ్యక్తికి స్పెషల్ జుడిషియల్ మెజిస్ట్రేట్ కరుణాకర్ రెండు రోజులజైలు శిక్ష విధించారు. కొన్నిరోజుల క్రితం పట్టణంలో డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించగా వరికొప్పుల పరషరాం అనే వ్యక్తి పట్టుబడగా పట్టణ ఇన్స్‌పెక్టర్ వెణుగోపాల్ అతనిని కోర్టులో ప్రవేశపెట్టగా మెజిస్ట్రేట్ రెండు రోజుల శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు..

వేసవి సెలవులు సద్వినియోగం చేసుకోండిలా

వేసవి సెలవులంటే పిల్లలకు చాలా ఇష్టం. పది నెలలుగా ప్రతి రోజు పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులంతా ఆటలు ఆడుతూ పాటలు పడుతూ కాలక్షేపం చేస్తు ఆనందంగా గడుపుతారు. వివిధ రకాల ఆటలు ఆడుతూ ఎంజాయ్ చేస్తుంటారు. గ్రామీణ ప్రాంతాల్లో పిల్లలు ఈత కోసం చెరువులు, బావుల దగ్గర హంగామా చేస్తారు. పట్టణాల్లో పిల్లలు సిమ్మింగ్‌పూల్‌కు బాట పడుతున్నారు. నృత్యంలో శిక్షణ తీసుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. కొంత మంది పిల్లలు కంప్యూటర్ నేర్చుకుంటున్నారు. వేసవిలో చిన్నారులు నేర్చుకునే అంశాలపై 'ఆంధ్రజ్యోతి' కథనం..

- చొప్పదండి,ఆంధ్రజ్యోతి

ఇష్టమైన రంగాల్లో రాణించేందుకు శిక్షణ



ఖోఖోతో వ్యాయామం

ఖోఖో ఆటలో పరిగెత్తడం ద్వారా రక్త ప్రసరణ బాగా జరుగుతుంది. ఆటలో క్రీడాకారుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో మిత్రులతో స్నేహభావం పెరుగుతుంది. సంపూర్ణ ఆరోగ్యంగా ఉండడానికి ఈ గ్రామీణ క్రీడ ఎంతో దోహదపడుతుంది. వాలీబాల్ ఆటతో శరీరంలో అన్ని అవయవాలు కదులుతాయి. కాళ్లకు చేతి కండరాలకు పని చేప్పే ఆట. వాలీబాల్ అందరికి మంచి వ్యాయామాన్ని అందించే ఆట.

గ్రామీణ ఆట కబడ్డీ

గ్రామీణ అటలలో కబడ్డీది ప్రత్యేక స్థానం. ఈ ఆటతో శరీరక దృఢత్వం పెరగడంతోపాటు రక్తప్రసరణ వృద్ధి చెందుతుంది. ఎముకలు బలపడుతాయి.

క్రికెట్‌తో చురుకుదనం

విద్యార్థులు అత్యంత ఇష్టపడే ఆటల్లో క్రికెట్ ఒకటి. సెలవు వచ్చిందంటే బ్యాట్, బంతితో నలుగురు పిల్లలు కలిసి గ్రౌండ్‌కు వెళ్తంటారు. క్రికెట్‌తో విద్యార్థుల్లో మానసిక ఉల్లాసంతోపాటు, చురుకుదనం పెరుగుతుంది. మానసిక ప్రశాంతత, స్నేహభావం పెంపొందుతుంది.

కంప్యూటర్ విద్య



నేటి పోటి ప్రపంచంలో కంప్యూటర్ విద్య తప్పనిసరిగా మారింది. దీని ప్రాధ్యాన్యాన్ని గుర్తించి వేసవిలో చిన్నారులకు కంప్యూటర్ పరిజ్ఞానం శిక్షణ పొందడానికి మంచి అవకాశం. ప్రతి ఒక్కరూ కంప్యూటర్‌పై పరిజ్ఞానం పెంచుకొనేందుకు కృషి చేస్తున్నారు.

ఇంగ్లీష్‌పై పట్టుకు ప్రయత్నం

ఉజ్వల భవిష్యత్‌కు ఇంగ్లీష్ భాష ప్రతి చిన్నారికి అవసరం. చదువుకునే కోర్సు, పోటి పరీక్షలో రాణించేందుకు అవసరమైన ఇంగ్లీష్ పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు వేసవిలో స్పోకెన్ ఇంగ్లీష్ నేర్చుకునేందుకు ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు.



క్యారమ్స్‌తో ఏకాగ్రత

ఏకాగ్రతతో లక్ష్యాన్ని ఎలా గురి పెట్టాలో నేర్పేదే క్యారమ్స్ విద్యార్థులు వేసవిలో ఇంటి దగ్గర నేర్చుకోవచ్చు.దీనితో చదువులో ఏకాగ్రత పెరుగుతుంది.

క్రికెట్‌తో చురుకుదనం

విద్యార్థులు అత్యంత ఇష్టపడే ఆటల్లో క్రికెట్ ఒకటి. సెలవు వచ్చిందంటే బ్యాట్, బంతితో నలుగురు పిల్లలు కలిసి గ్రౌండ్‌కు వెళ్తంటారు. క్రికెట్‌తో విద్యార్థుల్లో మానసిక ఉల్లాసంతోపాటు, చురుకుదనం పెరుగుతుంది. మానసిక ప్రశాంతత, స్నేహభావం పెంపొందుతుంది.

డ్రాయింగ్ నేర్చుకోవడానికి చక్కని అవకాశం..

విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చూసుకోవడానికి, తమలో సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఉపయోగపడేవాటిలో పెయింటింగ్ ముఖ్యమైనదని ఉపాధ్యాయులు చెబుతుంటారు. విద్యార్థులు వాటిలో శిక్షణ తీసుకుని అద్భుతాలు సృష్టించడానికి చక్కని అవకాశం. విద్యార్థులు వివిధ రకాల బొమ్మలను తమారు చేయడంలో శిక్షణ పొందవచ్చు.



మెదడుకు పని చెప్పే చదరంగం

విద్యార్థుల మేథస్సుకు పనిచెప్పే ఆటల్లో చదరంగం ముఖ్యమైంది. ఈ ఆటతో విద్యార్థికి సమయస్ఫూర్తి, ఆలోచనాశక్తి సమస్యలను ఎలా పరిష్కరించాల్లో నేర్పుతుంది. ఇంటి వద్దనే విద్యార్థి శిక్షకుడి సహాయంతో నేర్చుకోవచ్చు.





ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్య



శారద (ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్యాల గ్రామపరిధిలోగల జగ్గయ్యపల్లెకు చెందిన శారద(23) ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కమాన్‌పూర్ మండలం జూలపల్లికి చెందిన శారదను ఏడుసంవత్సరాల క్రితం జగ్గయ్యపల్లెకు చెందిన ఉప్పుల అజయ్‌కుమార్‌కు ఇచ్చి వివాహం చేశారు. ఆరునెలలుగా శారద మానసిక పరిస్థితి బాగాలేకపోవడంతో కరీంనగర్‌లోని వైద్యులకు చూపించారు. ఆదివారం రాత్రి ఇంటిముందు రేకుల షెడ్డులో శారద ఉరివేసుకుంది. సోమవారం ఉదయం భర్త అజయ్‌కుమార్ గమనించి శారద కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. మృతురాలికి కుమారుడు ఉన్నాడు. శారద తండ్రి రామస్వామి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

ఓసీపీ-5లో ప్రమాదం: కాంట్రాక్టు కార్మికుడు మృతి

గోదావరిఖని, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆర్‌జీ-1 ఏరియా ఓసీపీ-5 ప్రాజెక్టులోని 1సీమ్ కోల్‌బెంచ్‌లో సోమవారం ట్యాంకర్ బోల్తా పడిన ప్రమాదంలో అవుట్ సోర్సింగ్ సూపర్‌వైజర్, బీహార్‌కు చెందిన వికాస్ కుమార్(34) మృతి చెందాడు. వికాస్ కుమార్ పీసీ పటేల్ కంపెనీలో పని చేస్తున్నాడు. బ్లాస్టింగ్‌సెక్షన్‌లో పనిచేస్తున్న వికాస్‌కుమార్ ఎక్స్‌ప్లోజివ్ ట్యాంకర్‌పై ఎక్కివస్తున్నాడు. ట్యాంకర్ బోల్తా పడుతుండగా తప్పించుకునేందుకు వికాస్ కిందకు దూకాడు. ట్యాంకర్ వెనుక టైరు అతనిపై నుంచి వెళ్లడంతో మృతి చెందాడు. టుటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి ఆత్మహత్యాయత్నం

ఇల్లంతకుంట, మే 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన బాలసాని ఆశాలు(86) అనే వృద్ధుడు క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గ్రామస్థుల వివరాల ప్రకారం.. ఆశాలు బస్టాండు సమీపంలో దుకాణం నడుపుతుంటాడు. వారం రోజుల క్రితం దుకాణంలోకి ఓ బాలిక వచ్చిన సందర్భంగా చిన్న వివాదం జరిగింది. దీంతో బాలిక ఇంటికి వెళ్లి తన అక్కకు విషయం తెలిపింది. ఆ తర్వాత వృద్ధుడు తనను దూషించాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆశాలను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కొంత సమయానికి ఇంటికి పంపించారు. దీంతో మనస్థాపం చెందిన ఆశాలు ఆదివారం ఇంట్లో క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీనిపై ఎస్సై శ్రీకాంత్‌గౌడ్‌ను వివరణ కోరగా ఫిర్యాదు రావడంతో పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి విచారణ జరిపామని తెలిపారు.

మహిళ అనుమానాస్పద మృతి

కరీంనగర్ క్రైం, మే 5 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలో ఉంటున్న సిద్దిపేటలోని ప్రశాంత్‌నగర్‌కు చెందిన ఆలకుంట గౌరమ్మ(34) కొత్తపల్లి చెరువులో పడి మృతిచెందగా మృతిపై అనుమానాలున్నాయని మృతురాలి సోదరుడు కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గౌరమ్మకు ఒక కూతురు ఉంది. ఆమెభర్త కొంతకాలం కిందట అనారోగ్యంతో మరణించాడు. అప్పటినుంచి తల్లి, కూతుళ్లు కూలీపని చేస్తూ జీవిస్తున్నారు. గౌరమ్మ అప్పడప్పుడు మద్యం తాగి కూతురుతో గొడవపడేది. ఈ క్రమంలోనే ఏడాదిన్నర కిందట గౌరమ్మ కూతురుకు చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. కొద్దిరోజుల కిందట గౌరమ్మ తన కూతురు వద్దకు మరో వ్యక్తితో వచ్చి తాము ఇద్దరం కలిసి ఉంటున్నట్లు చెప్పింది. కొత్తపల్లిలో పొన్న బాలాజీ అనేవ్యక్తితో గౌరమ్మ కలిసి ఉంటున్నట్లు మృతురాలి సోదరుడు తెలిపాడు. ఆదివారం సాయంత్రం బాలాజీ ఇంట్లో మద్యం తాగుతున్న సమయంలో గౌరమ్మ, మరోమహిళ గొడవపడినట్లు తెలిసిందని, బాలాజీ, మరోమహిళపై అనుమానం ఉందని మృతురాలి సోదరుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

వడదెబ్బతో రైతు మృతి



గంగరాజం(ఫైల్)

మేడిపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలజిల్లా మేడిపల్లి మండల కేంద్రానికి చెందిన అత్తిని గంగరాజం(45) అనే రైతు వడదెబ్బతో సోమవారం తెల్లవారు జామున మృతి చెందాడు. గంగరాజం రెండు రోజుల నుంచి వరి కోత పనులు చేయిస్తున్నాడు. దీంతో ఆదివారం ఎండదెబ్బ తగిలి అస్వస్థతకు గురయ్యాడు. సోమవారం తెల్లావారుజామున గంగరాజం ఇంటిలో మృతిచెందాడు.

భార్యపై హత్యాయత్నం కేసులో భర్త రిమాండ్



నిందితుడి అరెస్టు చూపుతున్న ఎస్సై రాజన్న

కరీంనగర్ క్రైం, మే 5 (ఆంధ్రజ్యోతి): భార్యను హత్య చేసేందుకు యత్నించిన కేసులో భర్తను కరీంనగర్ పోలీసులు జైలుకు తరలించారు. కరీంనగర్ వన్‌టౌన్ ఎస్సై రాజన్న వివరాల ప్రకారం.. కరీంనగర్ సిఖ్‌వాడిలో గతనెల 18న తనభార్యను హత్య చేసేందుకు యత్నించిన అన్నమనేని కొమురయ్యను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సిఖ్‌వాడిలోని అమ్మ మెస్‌లో వంట పని చేస్తున్న భార్య వద్దకు వెళ్లిన ఆమె భర్త కొమురయ్య అక్కడే మెస్‌లో పొయ్యిపైన ఉన్న వేడికూరను ఆమెపై పోశాడు. దీంతో ఆమె ముఖం, ఛాతి, వీపుభాగాల్లో తీవ్రగాయాలయ్యాయి. హోటల్ యజమాని వెంటనే 108లో ఆమెను ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో కొమురయ్యపై కేసునమోదు చేశారు. భార్యపై కొమురయ్యకు అనుమానం ఉండేదని, గతంలో కొమురయ్యపై మహిళా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని, దీంతో భార్యపై కక్ష పెంచుకొని హత్య చేసేందుకు యత్నించాడని ఎస్సై తెలిపారు.

డీఈఈ సెట్-2025 నోటిఫికేషన్ విడుదల

తిమ్మాపూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జిల్లావిద్యా శిక్షణా సంస్థ(డైట్)లలో, ప్రైవేటుకళాశాలలో రెండుసంవత్సరాల డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఎల్ఈడీ), డిప్లొమాఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ (డీపీఎస్ఈ) మొదటి సంవత్సరం2025-26లో చేరుటకు నిర్వహించే డీఈఈసెట్2025 నోటిఫికేషన్ విడుదలైనట్లు ఎల్ఎండీ కాలనీలోగల డైట్‌కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరాంమొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈకోర్సులో చేరుటకు ఇంటర్‌లో అభ్యర్థులు కనీసం 50శాతంమార్కులు కల్గిఉండాలన్నారు. షెడ్యూల్ తెగలు, షెడ్యూలు కులాల, దివ్యాంగ అభ్యర్థులు కనీసం 45శాతంమార్కులు కలిగి ఉండాలని తెలిపారు. సెప్టెంబరు1, 2025నాటికి అభ్యర్థుల వయస్సు 17సంవత్సరాలు, గరిష్ట వయోపరిమితి లేదనితెలిపారు. దరఖాస్తులు ఆన్లైన్‌లోఈనెల15లోగా సమర్పించాలని తెలిపారు. ఈనెల25న ఆన్‌లైన్ ప్రవేశపరీక్ష ఉంటుందని తెలిపారు. డీఎల్ఈడీ కోర్సు తెలుగు, ఉర్దూ, ఆంగ్లమాధ్యమాల్లో, డీపీఎస్ఈ కోర్సు మాత్రమే ఆంగ్లమాధ్యమంలో ఉంటుందని తెలిపారు. కోర్సును ఏ మాధ్యమంలో చేయదలిస్తే ఆమాధ్యమంలోనే ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షరాయాలని తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్నవారు డీఈఈ సెట్-2025 వెబ్‌సైట్ deecet.cdse. telangana.gov.in ను సందర్శించాలని తెలిపారు.

జీవాల ఎరువు.. పంటలకు మేలు

- భూసారం పెరిగేందుకు దోహదం
- పొలాల్లో గొర్రెలు, మేకల మందలు
- కోళ్ల ఎరువుకు డిమాండ్



చెర్లబూత్కూర్ శివారులోని పొలంలో గొర్రెల మంద

కరీంనగర్ రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): కోతలు ముగియకముందే వానాకాలం సాగుకు అన్నదాతలు సన్నద్ధమవుతున్నారు. ముందుగా నేలను సారవంతం చేసేందుకు మూగజీవాల ఎరువును ఉపయోగిస్తున్నారు. పొలాల్లో గడ్డిఉండగానే కొందరు మేకలు, గొర్రెల మందలు పెట్టిస్తుండగా, మరికొందరు కోతలు అయిపోయాక గడ్డిని చుట్టి పశుగ్రాసానికి వినియోగిస్తుండగా, ఇంకొందరు తగలబెట్టి వర్షం కురిసిన తరువాత కలియ దున్నుతారు. ఆవులు, ఎద్దులు, గొర్రెలు, మేకలు, కోళ్ల, కంపోస్టు, సేంద్రియఎరువులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. రసాయన ఎరువుల వినియోగంతో భూసారం దెబ్బతినడం, పంట దిగుబడి తగ్గుతుండడంతో రైతులు జీవాల ఎరువుల వాడకంపై దృష్టిసారిస్తున్నారు.

రైతులు తమ పొలాల్లో గొర్రెలు, మేకల మందలు పెట్టిస్తున్నారు. గొర్రెలు మేకలమూత్రంలో పీహెచ్ విలువ 7.7ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. వీటిద్వారా చౌడుభూముల సారవంతంగా మారుతాయి. లీటర్‌మూత్రంలో 9నుంచి 13గ్రాముల నత్రజని 17నుంచి 20గ్రాముల పొటాషియం, పాస్ఫరస్ వంటివి ఉంటాయి. ఒక గొర్రెద్వారా ఒక రాత్రికి లీటర్‌మూత్రం 380నుంచి 540గ్రాముల వరకు పేడ లభిస్తుంది. ఒక్కరాత్రి పొలంలో ఉంచేందుకు రూ.1000నుంచి 1500 వరకు కాపరులు తీసుకుంటున్నారు. గొర్రెలు, మేకలమంద ద్వారా నత్రజని, భాస్వరం, పొటాష్‌తోపాటు బాక్టీరియా, ప్రొటోజోవా, ఫంగి తదితర ఉపయోగకరమైన సూక్ష్మజీవులతో నేలసారవంతం అవుతుంది. పశువుల పేడ ట్రాక్టర్‌కు రూ.3,500నుంచి4వేల చొప్పున రైతులు కొనుగోలు చేస్తున్నారు. సేంద్రియ ఎరువుల వాడకంతో భూసారం పెరుగుతుండటంతో రైతులు పశువుల ఎరువుల కోసం ఇప్పటి నుంచే అడ్వాన్స్‌లు ఇస్తున్నారు.

లారీల్లో కోళ్ల ఎరువు సరఫరా..

కొన్నేళ్లుగా కోళ్లఫారాల నుంచి వచ్చేవ్యర్థాలను ఎరువుగా ఉపయోగించుకునేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. వ్యాపారులు హైదరాబాద్, సిద్దిపేట తదితర జిల్లాలోని పౌల్ట్రీలనుంచి కోళ్ల వ్యర్థాలను సేకరిస్తున్నారు. గ్రామాల్లో తిరుగుతూ ఇప్పటి నుంచే రైతులకు లారీల చొప్పున సరఫరా చేస్తున్నారు. చిన్నలారీఅయితే రూ.20వేలు, పెద్దలారీ అయితే రూ.30వేల వరకు తీసుకుంటున్నారు.

కారు, ఆటో ఢీ..ఇద్దరికి గాయాలు

మల్యాల, మే 5 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల- కరీంనగర్ మార్గంలోని రాజారం సమీపంలో సోమవారం రాత్రి కారు, ఆటో ఢీకొన్న ఘట నలో ఒక్కరికి, అదే సమయంలో అక్కడే ద్విచక్రవాహనం ప్రమాదవవత్తు పడిపోవడంతో ద్విచక్రవాహనంపైగల మరో వ్యక్తికి గాయాలు అయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. కరీంనగర్ వైపు నుంచి జగిత్యాల వెలుతున్న కారు, జగిత్యాల వైపు నుంచి నూకపల్లికి వస్తున్న ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో ముందు భాగం నుజ్జు కాగ డ్రైవర్ వేముల శివకు గాయాలు అయ్యాయి. ఈ సంఘటన స్థలం నుంచే వెలుతున్న మల్యా లకు చెందిన బోగ రాజశేఖర్ ద్విచక్రవాహనం ప్రమాదవశత్తూ పడిపోవడంతో రాజశేఖర్‌కు గాయాలు అవడంతో గాయపడిన ఇద్దరినీ చికిత్సకోసం జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. కాగా కారు డ్రైవర్ పరారిలో ఉండగా పోలీసులు కారును పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి కేసు నమోదు చేశారు.

సెల్‌ఫోన్ షాపులో అగ్నిప్రమాదం

కరీంనగర్ క్రైం, మే 5 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కోతిరాంపూర్‌లోని ఒక సెల్‌ఫోన్ షాపులో సోమవారం రాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. సమాచారం అందుకున్న అగ్నిమాపకశాఖ అధికారులు, సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో కొంత ఆస్తి నష్టం వాటిల్లిందని అగ్నిమాపకశాఖ అధికారులు తెలిపారు.

అంజన్న హుండీ ఆదాయం రూ. 1.07కోట్లు



కొండగట్టులో హుండీల్లోని డబ్బులను లెక్కిస్తున్న సిబ్బంది

మల్యాల, మే 5 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి దేవస్థానానికి హుండీల ద్వారారూ.1,07,67,134 ఆదాయం సమకూరినట్లు ఈవోశ్రీకాంత్‌రావు తెలిపారు. 39రోజులకుగాను ఆలయంలోని 12హుండీలను విప్పి సోమవారం లెక్కించగా నగదుతోపాటు 134 విదేశీ కరెన్సీనోట్లు లభించినట్లు ఈవో తెలిపారు. ఈ లెక్కింపులో పర్యవేక్షకులు సునీల్, చంద్రశేఖర్, హరిహరనాథ్, ప్రధానార్చకులు రామకృష్ణ, రఘు, అధికారులు, ఏఎస్సై రమణారెడ్డి పాల్గొన్నారు. కాగాఇన్నాళ్లు హుండీలలో వచ్చిన మిశ్రమ బంగారం, వెండిని తూకం వేయగా ప్రస్తుతం వాటిని తూకం వేయకుండానే సంచిలో సీజ్‌చేసి మళ్లీ హుండీలలోనే వేశారు. స్థానిక శాసనసభ్యుడు మేడిపల్లి సత్యంకు మంత్రి పదవి వచ్చేలా ఆంజనేయ స్వామి ఆశీర్వదించాలంటూ ఎమ్మెల్యే అభిమాని ఒకరు హుండీలో చీటీరాసివేశారు. సోమవారం హుండీల లెక్కింపు సందర్భంగా రూ.500 నోటుకు చీటిపిన్ చేసి ఉండడం సిబ్బంది గమనించారు.

● హుండీల లెక్కింపులో వాగ్వాదం

కొండగట్టు అంజనేయస్వామి దేవస్థానం హుండీల లెక్కింపు సందర్భంగా ఆలయ ఈవో, లెక్కింపునకు వచ్చిన సేవకుడి మధ్య వాగ్వాదం జరిగినట్లు తెలిసింది. సేవకు వచ్చిన ఓ రిటైర్డ్ ఎంపీడీవో తదితరులతో సీసీ కెమెరాలో కనిపించే విధంగా లెక్కించాలని ఈవో సూచించి అక్కడినుంచి వెళ్లిపోయారు. కాసేపటికి పర్యవేక్షణలో భాగంగా మళ్లీ ఈవో వచ్చేసరికి రిటైర్డ్ ఎంపీడీవో అలాగే ఉండడంతో వారి మధ్య వాగ్వాదానికి దారితీసింది. అనంతరం సేవకు వచ్చిన ఆ రిటైర్డ్‌ఉద్యోగిని అక్కడి నుంచి పంపివేయడంతో గొడవ సద్దుమణిగింది.

ఈదురుగాలులు..వర్షం

- విరిగిపడ్డ చెట్లు
- నిలిచిపోయిన విద్యుత్‌సరఫరా
- ఆముదాలపల్లి, మెట్‌పల్లి గ్రామాల్లో వడగళ్ల వాన



కేశవపట్నంలో నేలకూలిన విద్యుత్ స్తంభం



వంకాయగూడెంలో జాతీయ రహదారిపై విరిగిపడ్డ చెట్టు

శంకరపట్నం/హుజూరాబాద్/గంగాధర, మే 5 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలంలో సోమవారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. బలమైన ఈదురుగాలులకు వంకాయగూడెం, తాడికల్ గ్రామాల్లో జాతీయరహదారిపై చెట్లు విరిగిపడ్డాయి. గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ముత్తారం, మొలంగూర్ గ్రామాల్లో రెండురేకుల షెడ్లు గాలికి ఎగిరిపోయాయి. ఆముదాలపల్లిలో ఓవ్యక్తి ఇంటి ఎదుట ఉన్న తాడిచెట్టిపై పిడుగుపడి మంటలు అంటుకున్నాయి. ఆముదాలపల్లి మెట్‌పల్లి గ్రామాల్లో వడగళ్ల వాన కురిసింది.

హుజూరాబాద్, గంగాధర మండలాల్లో సైతం ఈదురుగాలులతో కూడిన చిరుజల్లులు కురిశాయి. అకాలవర్షంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా కాపాడుకు నేందుకు రైతులు ఇబ్బందులుపడ్డారు. కొనుగోలు కేంద్రాల్లో సరిపడా టార్పాలిన్లు లేకపోవడంతో రైతులు కిరాయికి తెచ్చుకొని ధాన్యంపై కప్పారు. లక్ష్మీదేవిపల్లి, నాగిరెడ్డిపూర్, బూరుగుపల్లి గ్రామాల్లో గోలీకాయల సైజులో వడగళ్లు పడ్డాయి. రెండు గంటలపాటు విద్యుత్ అంతరాయం కలిగింది.

సుల్తానాబాద్: మండలంలోని కదంబాపూర్‌లో సోమవారం వీచిన గాలులకు అభినందన రైసుమిల్లుల గోదాములు ధ్వంసమయ్యాయి. గోదాముల రేకులు ధ్వంసం కాగా మరికొన్ని గాలిలో ఎగిరిపోయాయి. సత్యగణేష్ ఇండస్ట్రీస్ గోదాములు రైస్‌మిల్లు గోదాములు కూడా దెబ్బతిన్నాయి. సుద్దాల, కదంబాపూర్ గ్రామాలల్లో తోటల్లోని మామిడి కాయలు రాలిపోయాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



మార్కర్ నిటారుగా ఉన్నా కనిపించని నీడ

మిట్ట మధ్యాహ్నం నీడమాయం

కరీంనగర్ స్పోర్ట్స్, మే 5 (ఆంధ్రజ్యోతి): ఖగోళ అద్భుతంతో సోమవారం నుంచి ఈ నెల 14 వరకు మిట్ట మధ్యాహ్నం మనిషి నీడ రెండు నిమిషాల పాటు కనిపించదని ఆస్ట్రాయిడ్స్ సెర్చ్ క్యాంపెయిన్ కన్వీనర్ ఓడెలు కుమార్ తెలిపారు. మంగళవారం దీనికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. మిట్ట మధ్యాహ్నం నీడ మాయమవడాన్ని జీరో షాడోగా వ్యవహరిస్తారన్నారు. సాధారణంగా నీడ మనిషికి ఏదో ఒక పక్క కనిపిస్తుందని, సోమవారం నుంచి 14 వరకు మాత్రం రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో సూర్యకాంతి మన మీద లంబంగా పడి నీడ కనిపించదని వివరించారు. భూమి అక్షం 23.5 డిగ్రీలు వంపుగా ఉన్నందున


ఓదెలు కుమార్

సూర్యుడి చుట్టూ భ్రమణం చేసే సమయంలో సూర్యుడి స్థానం ఉత్తర-దక్షిణ దిశలో మారుతూ ఉంటుంది. ఏటా రెండు సందర్భాల్లో కర్కాటక, మకర రేఖల మధ్య ఉన్న ప్రదేశాల్లో మధ్యాహ్నం సమయంలో సూర్యకిరణాలు భూమిపై సంపూర్ణ లంబంగా పడతాయి. దీంతో నిలువు వస్తువుల నీడ రెండు నిమిషాల వరకు పూర్తిగా మాయమవుతుందన్నారు. ఖగోళ శాస్త్రవేత్తలు సూర్యుడి కదలిక, స్థానాన్ని, అధ్యయనం చేసేందుకు జీరో షాడో ఉపకరిస్తుందని తెలిపారు.

ఎస్సెస్సీ మార్కుల పునఃపరిశీలనకు అవకాశం



రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు చాన్స్

వెల్గటూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయని అనిపించిన విద్యార్థులు, ఫెయిలైన విద్యార్థులు మార్కులను పునఃపరిశీలన చేయడానికి ప్రభుత్వ పరీక్షల విభాగం అవకాశం కల్పించింది. చాలా మంది విద్యార్థులకు సరైన అవగాహన లేకపోవడం వలన పరీక్షల విభాగం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. ఉమ్మడి జిల్లాలో 38,498 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 37,667 మంది ఉత్తీర్ణులు అయ్యారు. 831 మంది విద్యార్థులు పరీక్షలో ఫెయిల్ అయ్యారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల మార్కుల పునః పరిశీలన కోసం ఆంధ్రజ్యోతి అందిస్తున్న ప్రత్యేక కథనం..

జిల్లాల వారీగా విద్యార్థుల వివరాలు


జిల్లా	విద్యార్థులు	ఉత్తీర్ణులు	అనుత్తీర్ణులు
జగిత్యాల	11849	11636	213
కరీంనగర్	12508	12245	263
పెద్దపల్లి	7387	7157	230
రాజన్నసిరిసిల్ల	6754	6629	125

రీ కౌంటింగ్

విద్యార్థులు ఎన్ని సబ్జెక్టుల్లో మార్కులు రీ కౌంటింగ్ చేసుకోవాలని కోరుకుంటారో వాటికి ఒక్కో సబ్జెక్టుకు రూ. 500 ఫీజు చెల్లించాలి.

దరఖాస్తుకు ఈనెల 15 వరకు గడువు

విద్యార్థులు ఈనెల 15లోగా నిర్ణీత రుసుము చెల్లించి మార్కుల లెక్కింపుతో పాటు జవాబు పత్రాల పునఃపరిశీలన చేయించుకోవడానికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఒక్కో సబ్జెక్ట్‌కు రూ.500లు ఎస్‌బీఐ బ్యాంక్‌లో చలానా రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. తద్వారా జవాబు పత్రాలను పొందడంతో పాటు తక్కువ మార్కులు వచ్చినట్లు గుర్తిస్తే మళ్లీ అదనంగా మార్కులు పొందే అవకాశం ఉంటుంది. మార్కుల రీ కౌంటింగ్ దరఖాస్తులను ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయం హైదరాబాద్‌కు నేరుగా కానీ లేదా పోస్టు ద్వారా గానీ పంపించవచ్చు.



దరఖాస్తులను పరీక్షల విభాగం వెబ్‌సైట్ నుంచి తీసుకొని వివరాలు నమోదు చేయాలి. విద్యార్థులకు సంబంధిత సబ్జెక్టులో వచ్చిన మార్కులను మాత్రమే లెక్కించి ఎక్కువ మార్కులు వస్తే సరి చేస్తారు. లేకుంటే మార్కులు అలాగే ఉంటాయి. జవాబు పత్రాలను చూసుకునే అవకాశం ఇందులో ఉండదు.

ఫీజుల వివరాలు

రీవెరిఫికేషన్ కోసం విద్యార్థులు ఒక్కో సబ్జెక్టుకు రూ.1000 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. రీ వెరిఫికేషన్‌లో విద్యార్థులు తాము రాసిన జవాబు పత్రాల జిరాక్స్ కాపీలను పొందవచ్చు. దీని వలన తాము రాసిన సమాధానాలకు మార్కులు సరిగా పడ్డాయా? లేదా? మార్కులు ఎన్ని వచ్చాయో చూసుకునే అవకాశం ఉంటుంది. రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకుంటే మళ్లీ మార్కుల రీకౌంటింగ్ కోసం దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. రీ వెరిఫికేషన్‌కు హాల్ టికెట్ జిరాక్స్ కాపీ, కంప్యూటరైజ్డ్ ప్రింటెడ్ మెమోతో పాటు పూర్తి చేసిన దరఖాస్తులను సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు మాత్రమే అందజేయాలి. ఎస్సెస్సీ బోర్డుకు నేరుగా కానీ, పోస్ట్ ద్వారా గానీ పంపిన దరఖాస్తులు ఆమోదించబడవు. ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల వ్యక్తిగత చలాన్ ద్వారా ఫీజు చెల్లించాలి. రీ వెపికేషన్‌కు విద్యార్థులు ఈనెల 15 వరకు సంబంధిత ప్రధానోపాధ్యాయులకు దరఖాస్తులు సమర్పించాలని జగిత్యాల డీఈవో రాము సూచించారు.

వేములవాడలో భక్తుల రద్దీ

50 వేలకు పైగా తరలివచ్చిన భక్తులు



క్యూలైన్లో బారులు తీరిన భక్తులు

వేములవాడ కల్చరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): హర హర మహాదేవ.. శంభో శంకరా.. అనే నామస్మరణతో రాజన్న ఆలయం సోమవారం మారుమోగింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి తెల్లవారు జామున ఆలయ ధర్మగుండంలో పవిత్ర స్నానాలను ఆచరించి కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. రాజన్నకు ఎంతో ఇష్టమైన కోడెమొక్కు చెల్లించుకునేందుకు భక్తులు సుమారు నాలుగు గంటలు క్యూలైన్‌లో నిరీక్షించారు. స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీబద్ది పోచమ్మ అమ్మవారికి బోనాలు చేసి డప్పుచప్పుళ్ల, శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా ఆలయానికి తరలివెళ్లి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సోమవారం కావడంతో 50 వేలకు పైగా భక్తులు తరలివచ్చినట్లు అంచనా వేస్తున్నారు. రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏఈవోలు శ్రావణ్‌కుమార్, బ్రహ్మన్నగారి శ్రీనివాస్, అశోక్ కుమార్ సూపరిండెంట్ వరి నర్సయ్య, నరేందర్ టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్, గిరి, రాజేశంలు ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

రాజన్నను దర్శించుకున్న సింగర్ మానుకోట ప్రసాద్

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని సింగర్ మానుకోట ప్రసాద్ దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఫోక్ సింగర్ ప్రసాద్ రాజన్న ఆలయ చరిత్రపైన నూతన పాటను చిత్రీకరించి త్వరలో విడుదల చేస్తున్న సందర్భంగా రాజన్నను దర్శించుకున్నారు. స్వామి వారి ప్రత్యేక పూజల అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం గావించి రాజన్న ప్రసాదం అందజేశారు.



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల ఆందోళన

కోనరావుపేట, మే 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం స్పందించి ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు సోమవారం ఆందోళనకు దిగారు. కోనరావుపేట మండలం వట్టిమల్ల గొల్లపల్లి గ్రామంలో రైతులు రోడ్డుపై బైఠాయించి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఇప్పటికీ నెలరోజులు గడిచినా 2,000 కింటాళ్ల మాత్రమే తూకం వేశారని మరో 20 వేల క్వింటాళ్ల కొనుగోలు చేయాల్సి ఉందని అన్నారు. వర్షాకాలం దగ్గర పడుతున్న నేపథ్యంలో వెంటనే లారీలను తెప్పించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి రైతులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న గొల్లపల్లి రైతులు

- రేవంత్‌రెడ్డికి ధైర్యం ఉంటే మావోయిస్టులపై నిషేధం ఎత్తివేయాలి..
- తెలంగాణలో జరిగింది కుల గణన సర్వే... కేంద్రం చేసేది కుల గణన...
- రాజీవ్ రహదారి కాంట్రాక్టు గడువు పొడిగింపునకు యత్నిస్తే వ్యతిరేకిస్తా...
- తెలంగాణకు పదేళ్లలో కేంద్రం రూ.12లక్షల కోట్లు ఇచ్చింది...
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

కులగణనతో బీసీలకు న్యాయం

గోదావరిఖని, మే 5 (ఆంధ్రజ్యోతి): కుల గణనతో బీసీలకు న్యాయం జరుగుతుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. సోమవారం ఎన్‌టీపీసీ గెస్ట్‌హౌస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం చేపట్టనున్న కులగణనకు రాష్ట్రం చేసిన కుల గణన సర్వేకు పొంతన లేదన్నారు. రాష్ట్ర సర్వేలో కేవలం 50శాతం ప్రజలను మాత్రమే సర్వే చేశారన్నారు. కేంద్రం చేసేది కుల గణన అని, ప్రతి ఇంటికి, ప్రతి వ్యక్తి వద్దకు వెళ్లి వివరాలు సేకరిస్తారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 42శాతం బీసీలకు రిజర్వేషన్ ప్రకటించామని చెబుతున్నా అందులో 10శాతం ముస్లింలకు ఇచ్చారని, ఇక బీసీలకు ప్రతిపాదించింది 32 శాతమేనన్నారు.



మావోయిస్టుల మెప్పు పొందేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌లు పోటీ పడుతున్నారని, రేవంత్ రెడ్డికి ధైర్యం ఉంటే రాష్ట్రంలో మావోయిస్టులపై నిషేధం ఎత్తివేయాలని సవాల్ చేశారు. కాంగ్రెస్ పార్టీ నే మావోయిస్టులను నిషేధించిందన్నారు. పదేళ్ల అధి కారంలో ఉన్న కేసీఆర్ ఆ పార్టీపై ఎందుకు నిషేధం ఎత్తివేసి చర్చలు జరుప లేదని ప్రశ్నించారు. మావోయిస్టు పార్టీతో మాటలు లేవు, మాట్లాడుకోవడాలు కూడా లేవని ఆయన తేల్చి చెప్పారు. వారు బేషరతుగా తుపాకులు వీడి లొంగిపోవాలన్నారు. రాష్ట్రంలో పీపుల్స్‌వార్ పార్టీ, మావోయిస్టులు అనేక విధ్వంసాలకు పాల్పడ్డారని, ఎంతో మంది ప్రజా ప్రతినిధులను, నాయకులను పొట్టన పెట్టుకున్నారన్నారు.

చంద్రబాబుపై అలిపిరిలో దాడి చేశారని, అప్పటి హోం మంత్రి మాధవరెడ్డిని పొట్టనపెట్టుకున్నారన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో నర్సిరెడ్డి, నల్గొండ జిల్లాలో ఎమ్మెల్యే రాగ్యానాయక్, కరీంనగర్ జిల్లాలో మాజీ మంత్రి శ్రీపాదరావు, మల్హర్‌రావులను హత్య చేశారన్నారు. ఇప్పుడు ఆపరేషన్ కగార్ గురించి మాట్లాడుతున్న హరగోపాల్, వరవరరావులు అంత్యక్రియల్లో శవాలను మోయడం తప్ప ఏం సాధించారో చెప్పాలన్నారు. ఆపరేషన్ కగార్‌తో ఆదివాసీలపై దాడి అంటూ దుష్ప్రచారం చేస్తున్నారని, ఆదివాసీలు వేరు, మావోయిస్టులు వేరు అన్నారు. ఆదివాసీలకు తుపాకి హింసతో సంబంధం లేదని, వారెన్నడూ ప్రభుత్వంపై తిరగబడలేదన్నా రు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి పదేళ్లల్లో రూ.12 లక్షల కోట్ల నిధులను ఇచ్చిందన్నారు. జాతీయ రహదారులకు 1.2 లక్షల కోట్లు, రైల్వే లైన్లు, రైల్వే స్టేషన్ల ఆధునీ కరణకు రూ.32వేల కోట్లు కేటాయించారని, ధాన్యం కొనుగోలుకే 1.5లక్షల కోట్లు ఇచ్చిందన్నారు.

రాజీవ్ రహదారిని అప్పగిస్తే నేషనల్ హైవేగా అభివృద్ధి చేస్తామని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వమే సంబంధిత కాంట్రాక్టర్‌ను ఒప్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. రాజీవ్ రహదారి కాంట్రాక్టర్‌కు గడువును పొడిగించేందుకు కేంద్రం సహకరిస్తుందనేది అబద్ధమని, అలాంటి చర్యలను రాష్ట్రం ప్రతిపాదిస్తే ప్రజలు వ్యతిరేకిస్తారన్నారు. రామగుండంలో ఈఎస్ఐ ఆసుపత్రి గురించి తనకు సమాచారం లేదని, కరీంనగర్ కు మాత్రం ఈఎస్ఐ ఆసుపత్రి మంజూరైం దన్నారు. విలేకరుల సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి, నాయకులు కందుల సంధ్యారాణి, మేరుగు హన్మం తుగౌడ్, బల్మూరి వనిత, కోమళ్ల మహేష్, సోమారపు లావణ్య, ధర్మపురి, క్యాతం వెంకటరమణ, బల్మూరి అమరేందర్‌రావు పాల్గొన్నారు.



పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సీతక్క

ఆదివాసీ ప్రాంతాల్లో శాంతియుత వాతావరణం నెలకొల్పాలి

- నా విప్లవ బంధం తెగిపోయినా ఆదివాసీ బంధం తెగిపోలేదు
- హింసను ప్రేరేపించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి
- రాహుల్ ఆలోచన విధానంతోనే దేశంలో కులగణన

ధర్మారం, మే 5 (ఆంధ్రజ్యోతి): విప్లవోద్యమంతో తనకు బంధాలు తెగిపోయినా, అదివాసీయుల పేగు బంధం తెగిపోలేదని, ఆదివాసీ ప్రాంతాల్లో స్వేచ్ఛ, శాంతియుత వాతవరణం నెలకొల్పాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. సోమవారం ధర్మారం మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ ఆపరేషన్ కగార్‌తో ఆదివాసీ బిడ్డలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, చట్టాన్ని ఎవరూ చేతిలోకి తీసుకోకుండా ఆదివాసి ప్రాంతాల్లో స్వేచ్ఛ, శాంతి వాతావరణం నెలకొల్పడం ఈ రాష్ట్రంతో పాటు దేశానికి అవసరమని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి సంక్షేమం - అభివృద్ధి రెండు కళ్లలాంటివని, సంక్షేమాన్ని మరువకుండా అభివృద్ధిని విస్మరించకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని నడిపిస్తున్నారన్నారు. రాహుల్‌గాంధీ ఆలోచన విధానంతోనే దేశంలో కులగణన చేపట్టారని, అందుకు తెలంగాణ రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకుని కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయడం సంతోషదాయకమని పేర్కొన్నారు.

పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణతోపాటు పేదలకు లబ్ధి జరిగే సంక్షేమ పథకాలను సీఎం రేవంత్‌రెడ్డి చేపడుతున్నారన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నిరుద్యోగులను విస్మరించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన సంవత్సరంలోపే 60 వేల ఉద్యోగాలు ఇచ్చి నిరుద్యోగులను ఆదుకుందన్నారు. ధర్మారం తెనుగువాడ నుంచి ఎండపల్లి ఎక్స్ రోడ్డు వరకు సీఆర్ఆర్ గ్రాంటు నుంచి 3 కోట్ల 20 లక్షల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణానికి, ఖిలావనపర్తిలోని పోచమ్మ ఒర్రె వద్ద సీఆర్ఆర్ గ్రాంటు నుంచి కోటి 25 లక్షల వ్యయంతో పనులకు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి శంకుస్థాపన చేశారు.

ప్రభుత్వానికి ఆర్థిక పరమైన ఇబ్బందులు ఉన్నప్పటికి ఉచిత విద్యుత్, సన్నబియ్యం, ఉచిత బస్సు వంటి పథకాలు పేద ప్రజల కోసం చేపడుతున్నామన్నారు. అంగన్‌వాడీ టీచర్ల సమస్యలపై అవగాహన ఉందని, ఎన్నడూ లేని విధంగా అంగన్‌వాడీ బడులకు సెలవులు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే దక్కుతుందని పేర్కొన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యేలు విజయరమణారావు, రాజ్‌ఠాకూర్ సింగ్, కలెక్టర్ కోయా శ్రీహర్ష, తహసీల్దార్ వకీల్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఏఈ రాజశేఖర్, అనుదీప్ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం
పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

పెగడపల్లి: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. పెగడపల్లి మండలంలోని కీచులాటపల్లిలో సోమవారం ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్‌తో కలసి మంత్రి సీతక్క రూ.20 కోట్ల నిధులతో చేపట్టనున్న నియోజకవర్గ పరిధి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ నియోజకవర్గానికి రూ. 20 కోట్ల సీఆర్ఆర్ నిధులు కేటాయించి పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. విడతల వారీగా మరో 30 కోట్లు మంజూరుకు మంత్రి సీతక్క హామీ ఇచ్చారు.

జిల్లా కేంద్రంలో జిల్లా పరిషత్ భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానన్నారు. అనంతరం మండలంలోని నార్సింహునిపేట గ్రామంలో తాండ్ర లక్ష్మి అనే పేదింటి మహిళ ఇంట్లో ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా సరఫరా చేసిన సన్న బియ్యం భోజనాన్ని మంత్రి సీతక్క, అధికారులు, గ్రామస్థులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలో రోడ్లు, సాగు, తాగు నీటి అవసరాల కోసం ప్రత్యేక దృష్టి సారించి నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమాలలో కలెక్టర్ సత్యప్రసాద్, అడిషనల్ కలెక్టర్ గౌతంరెడ్డి, డీఆర్‌డీవో రఘువరన్, డీపీవో మదన్‌మోహన్, డీడబ్ల్యుఓ నరేష్, పంచాయతీ రాజ్ సీఈ సమత, ఈఈ శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ రవీందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాములు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




నార్సింహునిపేటలో లబ్ధిదారు ఇంటిలో భోజనం చేస్తున్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ

శ్వాస అందక ఉక్కిరిబిక్కిరి

- రోజురోజుకు పెరుగుతున్న ఆస్తమా బాధితులు
- నేడు ప్రపంచ ఆస్తమా దినోత్సవం

సుభాష్‌నగర్, మే 5 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక శ్వాస సంబంధ వ్యాధుల్లో ఆస్తమా ఒకటి. ఊపిరితిత్తుల్లోని వాయునాళాల్లో వివిధ కారణాలతో కండరాలు వాచిపోతాయి. దీంతో ఆ నాళాలు సన్నగా మారుతాయి. ఇది శ్వాసకు ఆటంకంగా మారుతుంది. ఏదైనా చిన్న పని చేసినా ఆయాసం వస్తుంది. ఆస్తమా తీవ్రంగా మారితే పరిణామాలు అత్యంత ప్రమాదకరంగా ఉంటాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా 262 మిలియన్ల మంది ఆస్తమాతో ఇబ్బంది పడుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌వో) అంచనా ప్రకారం మనదేశంలో 3.4 కోట్ల మంది ఆస్తమాతో బాధపడుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉబ్బసం గురించి అవగాహన పెంచేందుకు ప్రతి సంవత్సరం మే మొదటి మంగళవారం రోజు ప్రపంచ ఆస్తమా దినోత్స వాన్ని నిర్వహిస్తారు. డబ్ల్యుహెచ్‌వో ఆధ్వర్యంలో 1998 నుంచి ఆస్తమా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.



ఈ సంవత్సరం థీమ్....

ప్రపంచ ఆస్తమా దినోత్సవం సందర్భంగా ప్రతి సంవత్సరం ఒక థీమ్ తీసుకుంటారు. ఈ సంవత్సరం 'ఇన్‌హెల్డ్ ట్రీటిమెంట్స్ అందరికి అందుబాటులో ఉండేలా చేయండి' అనే థీమ్‌ను తీసుకున్నారు. ఇన్‌హెల్డ్ కార్టికోస్టెరాయిడ్స్ వంటి అవసరమైన అస్తమా మందులపై అవగాహన కల్పించడం ఈ థీమ్ ఉద్దేశం.

చికిత్సతో ఆస్తమా తగ్గించవచ్చు
డాక్టర్ సుమలత, చెస్ట్ ఫిజీషియన్



అస్తమా వ్యాధి సరైన చికిత్సతో తగ్గిపోతుంది. ఆస్తమా ఉన్నవారు దుమ్ము ధూళికి ఉండాలి. బయటకు వెళ్లినప్పుడు తప్పనిసరిగా మాస్క్ ధరించాలి. పొగ తాగవద్దు. శీతల పానియాలు, అల్కాహాల్ సేవించవద్దు. వాతావరణంలో మార్పులు వచ్చినప్పుడు జాగ్రత్త వహించాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. అస్తమా లక్షణాలు కనిపించిన వెంటనే ఛాతి వ్యాధి నిపుణులను సంప్రదించాలి. వారి సలహాల మేరకు మందులను క్రమం తప్పకుండా తీసుకోవాలి.

లక్షణాలు, నివారణ

ఆస్తమా లక్షణాలు క్రమక్రమంగా బయటపడతాయి. తరుచుగా అలసట, దీర్ఘకాలిక జలుబు, కాలనుకూలంగా అలెర్జీలు వంటివి ఈ వ్యాధి ప్రధాన లక్షణాలు. ఆస్తమా ఉన్న వారు వాయు కాలుష్యం, చల్లని గాలి, సువాసనలు మొదలైన వాటికి దూరంగా ఉండాలివ. సిగరెట్లు, కొవ్వొత్తులు, ధూపం, బాణసంచా నుంచి వచ్చే పొగను పీల్చొద్దు. జలుబు లేదా ఫ్లూ ఉన్న వ్యక్తులకు దూరంగా ఉండాలి. పరిసరాలను దుమ్ము ధూళి లేకుండా చూసుకోవాలి. మందులను క్రమం తప్పకుండా తీసుకోవాలి.



రోడ్డు విస్తరణ పనులు వేగంగా చేపట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్ , మే 5 (ఆంధ్రజ్యోతి): వేములవాడ ఆలయ రోడ్డు విస్తరణ, భూసేకరణ పనులు వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వేములవాడ ఆలయ రోడ్డు విస్తరణ, భూ సేకరణ పనుల పై జిల్లా కలెక్టర్ అధికారులతో రివ్యూ నిర్వహించారు. రోడ్డు విస్తరణకు అవసర మైన భూసేకరణకు సర్వే చేసి త్వరగా అందించాలని, విధుల్లో అలసత్వం వహించిన వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. 315 ఇల్ల నిర్మాణాల ప్రతిపాదనలను 5 టీంల ఇంజనీరింగ్ అధికారుల ద్వారా ఇప్పటి వరకు 217 ఇండ్లకు సంబంధించిన సర్వే పూర్తి చేసినట్లు, మిగిలినవి వీలైనంత త్వరగా అందిస్తామని అధికారులు తెలిపారు. చట్టంపై అధికారులు అవగాహన పెంచుకొని వారంలో మొత్తం భూ సేకరణ సర్వే పొరపాట్లు జరగకుండా పూర్తి చేసి ప్రతిపాదనలు అందిస్తే అవార్డులు అందచేస్తామని అన్నారు. ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాధ భాయి, ఈఈ ఆర్‌బి రమణయ్య, వేములవాడ మున్సిపల్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

కుల వృత్తులను కాపాడుతాం

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ కేకే మహేందర్‌రెడ్డి


దీక్షను విరమింపజేస్తున్న కేకే మహేందర్‌రెడ్డి

ముస్తాబాద్, మే 5: కుల వృత్తులను కాపాడుతామని స్వర్ణకారులు ఇబ్బంది పడొద్దని సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కెకె మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఎదుట 12 రోజులుగా దీక్ష చేస్తున్న స్వర్ణకారులకు సోమవారం సంఘీభావం తెలిపారు. స్వర్ణ కారులకు అండగా ఉంటానని నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి,ఎఎంసీ ఛైర్మన్ తలారి రాణినర్సయ్య, పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు, మాజీ ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, తాళ్ల విజయ్‌రెడ్డి, మిరుదొడ్డి భాను, రంజాని నరేశ్, శీల ప్రశాంత్, ఏదూనూరి భాను, ఉచ్చిడి బాల్‌రెడ్డి స్వర్ణకారులు చింతోజు బాలయ్య పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారం కోసమే భూభారతి


దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆర్డీవో రాధాభాయ్

రుద్రంగి, మే 5 (ఆంధ్రజ్యోతి) : భూసమస్యల శాశ్వత పరిష్కారం కోసమే భూభారతి చట్టాన్ని అమలు చేస్తున్నట్లు వేములవాడ ఆర్డీఓ రాధాబాయి తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని భూభారతి పైలట్ ప్రాజెక్టు అమలు కోసం రుద్రంగి మండలాన్ని ఎంపిక చేయగా సోమవారం రుద్రంగి, మనాల గ్రామాల్లో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రుద్రంగిలో 24 మానాలలో 106 భూ సమస్యలపై దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీలత, పైలెట్ ప్రాజెక్టు ఇన్‌చార్జి తహసీల్దార్ భూపతి, మానాల పైలెట్ ప్రాజెక్టు ఇన్‌చార్జ్ తహసీల్దార్ షరీఫ్, డిప్యూటీ తహసీల్దార్ మనోహర్ రావు, ఆర్ఐ శ్యామ్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ చెలుకల తిరుపతి, తర్రె మనోహర్, ఎర్రం గంగ నర్సయ్య ఉన్నారు.

మాజీ సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


మల్కాపేటలో మాజీ సీఎంకు నివాళులర్పిస్తున్న నాయకులు

కోనరావుపేట, మే 5 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం మల్కాపేట గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి సోమవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేత, మాజీ ఎంపీపీ చంద్రయ్య గౌడ్ మాట్లాడుతూ మల్కాపేట రిజర్వాయర్ నిర్మించడానికి అహర్నిశలు కృషి చేసిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అని అన్నారు. ఆదివారం మల్కాపేట రిజర్వాయర్ నుంచి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నీటిని విడుదల చేస్తారని తెలిపారు.

కార్యకర్తలకు కాంగ్రెస్ స్నేహహస్తం

ఎల్లారెడ్డిపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): పల్లెపల్లెల్లో కాంగ్రెస్ పార్టీని పటిష్ట పర్చడంతో పాటు కష్టపడి పని చేస్తున్న కార్యకర్తలకు సముచిత స్థానం కల్పించడమే లక్ష్యమని పీసీసీ పరిశీలకుడు ఖాజా ఫక్రుద్దిన్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాలులో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య అధ్యక్షతన ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, వీర్నపల్లి మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం సోమవారం జరిగింది. ముఖ్య అతిథులుగా పీసీసీ పరిశీలకులు ఖాజా ఫక్రుద్దిన్, చైతన్య కృష్ణారెడ్డి, సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి హాజరయ్యారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

● కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝూ ● అర్జీదారులతో కిటకిటలాడిన కలెక్టరేట్

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని జిల్లా అధికారులను జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝూ ఆదేశించారు. సిరిసిల్ల జిల్లా సమీకృత కలెక్టరేట్‌కు సోమవారం ప్రజలు తమ సమస్యలను చెప్పుకునేందుకు జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చారు. కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో ఏర్పాటు చేసిన ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి శేషాద్రిలు పాల్గొని సమస్యలను విన్నవించేందుకు వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ ప్రజావాణిలో 167 దరఖాస్తులు, ఫిర్యాదులు రాగా ఇందులో సీపీవోకు 1, జిల్లా వ్యవసాయాధికారికి 1, జిలా పౌర సరఫరాల శాఖ అధికారికి 5, జిల్లా విద్యాధికారికి 3, జిల్లా వైద్యాధికారికి 10, మైనార్టీ సంక్షేమశాఖ అధికారికి 4, ఈడీఎంకు 1, గృహనిర్మాణశాఖ కు 6, ఎల్డీఎంకు 4, సెస్‌కు 4, జిల్లా మెడికల్ కళాశాలకు 1,ఇల్లంతకుంట ఎంపీడీవోకు 1, గంభీరావుపేట ఎంపీడీవోకు 5, కోనరావుపేట ఎంపీడీవోకు 2, ముస్తాబాద్ఎంపీడీవోకు 3, తంగళ్లపల్లి ఎంపీడీవోకు 12, వేములవాడ రూరల్ ఎంపీడీవోకు 1, ఎల్లారెడ్డిపేట ఎంపీడీవోకు 4, సిరిసిల్ల మున్సిపాల్టికి 11, వేములవాడ మున్సిపాల్టీకి 3, సిరిసిల్ల అర్డీవోకు 3, వేములవాడ అర్డీవోకు 4, ఎస్‌డీసీకి 16, ఎస్పీ కార్యాలయానికి 3, బోయిన్‌పల్లి తహసీల్ధార్‌కు 5, చందుర్తి తహసీల్ధార్‌కు 3, ఇల్లంతకుంట తహసీల్దార్‌కు 8, గంభీరావుపేట తహసీల్దార్‌కు 5, కోనరావపేట తహసీల్దార్‌కు 3, ముస్తాబాద్ తహసీల్ధార్‌కు 2, సిరిసిల్ల తహసీల్దార్‌కు 3, తంగళ్లపల్లి తహసీల్దార్‌కు 9, వీర్నపల్లి తహసీల్దార్‌కు 1, వేములవాడ తహసీల్దార్‌కు 4, వేములవాడ రూరల్ తహసీల్దార్‌కు 2, ఎల్లారెడ్డిపేట తహసీల్దార్‌కు 6, డీసీఎంఎస్‌కు 1 చొప్పున దరఖాస్తులతో పాటు ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన అర్జీలపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి త్వరితగితన పరిష్కారం చూపడంతో పాటు అర్జీదారులకు లిఖిత పూర్వకంగా సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.


అర్జీదారు సమస్య వింటున్న కలెక్టర్


కలెక్టరేట్‌కు తరలివచ్చిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

డేటా ఎంట్రీ డబ్బులు చెల్లించండి

రాజన్న సిరిసిల్లజిల్లా వ్యాప్తంగా చేపట్టిన బీసీ కులగణ సర్వే డేటాను ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేసిన ఆపరేటర్‌లకు ఇంతవరకు డబ్బులు చెల్లించలేదని జిల్లా కలెక్టర్ స్పందించి డబ్బులను ఇప్పించాలంటూ సోమవారం డేటా ఎంట్రీ అపరేటర్‌లు అహ్మద్, ఎస్‌డీ నయిముద్దీన్, రాజు, ఎంఏ ఇమ్రాన్, ఎండీ షకీల్, ఎంఏ ఇర్ఫాన్, తేజా, ఎంఏ ఫైజల్‌లు జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూను కలిసి వినతిపత్రం అందించారు.

వైద్యానికి ఆర్థికసాయం అందించాలి

జింక ప్రభాస్, వన్‌పల్లి, వీర్నపల్లి



మూడు సంవత్సరాల క్రితం బ్లడ్‌క్యాన్సర్ రావడంతో అప్పు చేసి వైద్యం చేయించుకుంటున్నా. మా తల్లిదండ్రులు నిరుపేదలైనా నా వైద్యం కోసం ఇప్పటివరకు రూ. 15 లక్షలు అప్పులుచేసి వైద్యం చేయించారు. మరింత వైద్యం చేయించేందుకు మా తల్లిదండ్రుల వద్ద డబ్బులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. స్పందించి వైద్యానికి ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల్లో అవకతవకలు

- ప్రశాంత్, కొండాపూర్, ముస్తాబాద్



సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నాలుగు సంవత్స రాల నుంచి ఈసీజీ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నా. ఇటీవల మెడి కల్ కళాశాలలో జరిగిన టెక్నీషియన్ రిక్రూట్‌మెంట్‌లో అర్హత, అనుభవం లేని వారిని తీసుకున్నారు. కలెక్టర్ స్పందించి అవకాశం కల్పించాలి.

మెడికల్ కళాశాల భవన నిర్మాణంలో భూమి కోల్పోయాను

- లింగంపల్లి సత్యనారాయణ, పెద్దూర్,



పెద్దూర్ గ్రామ శివారులో నిర్మించిన జిల్లా మెడికల్ కళాశాలల భవనాల నిర్మాణాల్లో తనకు ఉన్న ఐదు ఎకరాల భూమి కోల్పోయాను. నష్టపరిహారంతో పాటు ఎకరానికి వెయ్యి గజాల చొప్పున మరోచోట కమర్షియల్ స్థలాన్ని అందిస్తామని హామీ ఇచ్చినా ఇప్పటి వరకు ఏమీ ఇవ్వలేదు. కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలి.

మెడికల్ కళాశాలలో అనర్హులకు ఉద్యోగాలు

సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాలల్లో అనర్హులకు ఉద్యోగాలు ఇచ్చారని అరులైన మాకు అన్యాయం జరిగిందంటూ పలువులు సోమవారం జిల్లా కలెక్టరేట్‌కు తరలివచ్చి జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూను కలిసి విన్నవించారు. ల్యాబ్ అసిస్టెంట్‌తో పాటు ఇతర పోస్టులలో అవకతవకలు జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతినాయక్, రమేష్, ప్రవీణ్, కిరణ్, ప్రకాష్, గణేష్, సంతోష్, సాయి కృష్ణ పాల్గొన్నారు.

నన్ను పోషించడం లేదు

- వంతడుప్పుల నర్సవ్వ, చిన్నలింగాపూర్



తంగళ్లపల్లి మండలం చిన్న లింగాపూర్ గ్రామానికి చెందిన నాకు ముగ్గురు కుమారులు ఉన్నారు. మాకు ఉన్న ఆస్తులను ముగ్గురు కుమారులకు సమానంగా ఇచ్చాము. అయితే భర్తతో పాటు కుమారులు కూడా చనిపోయారు. మా ఆస్తితో జీవిస్తున్న ఇద్దరు కోడళ్లు వారి పిల్లలు నాకు తిండిపెట్టకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. కలెక్టర్ చర్యలు తీసుకోవాలి.

కంపించిన భూమి.. ఉలిక్కిపడ్డ జనం


సిరిసిల్లలో భూమి కంపించడంతో రోడ్డుపైకి వచ్చిన జనం


వేములవాడలో ఇళ్ల నుంచి బయటకు వచ్చిన జనం

సిరిసిల్ల, మే 5 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపాటుకు గురయ్యారు. సోమవారం సాయంత్రం 6.40 నిముషాల ప్రాంతంలో భూమి కంపించడంతో ఎం జరుగుతుందోనని ప్రజలు ఆందోళనకు గురయ్యారు. ఇండ్లలోని వస్తువులు స్వల్పంగా కుదుపులకు గురయ్యాయి. జిల్లాలో రిక్టర్ స్కేల్‌పై 3.9 వరకు నమోదైనట్లు భావిస్తున్నారు.

● గంభీరావుపేట: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో సోమవారం సాయంత్రం స్వల్పంగా భూ కంపించింది. ఉన్నట్టుండి ఒక్కసారి భూమి కదలడంతో ప్రజలు భయంతో పరుగులు తీశారు. కొన్ని చోట్ల సామగ్రి కింద పడ్డాయి. ప్రజలు ఇండ్ల నుంచి భయంతో భయటకు పరుగులు తీశారు.

● ఇల్లంతకుంట: మండంలోని పలు గ్రామాలలో సోమవారం స్వల్పంగా భూమి కంపించింది. పెద్దలింగాపూర్, గాలిపెల్లి, ఇల్లంతకుంట, వంతడుపుల, వెల్జీపూర్, అనంతారం తదితర గ్రామాలలో రెండు సార్లు భూమి కంపించినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు.

● ముస్తాబాద్: ముస్తాబాద్ మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం స్వల్పంగా భూకంపం వచ్చింది. దాదాపు మూడు సెకన్ల పాటు భూమి కంపించడంతో భయందోళనలతో ఇళ్లలో ఉన్నవారు బయటకు వచ్చారు. భూకంపం అని తెలిసే సరికి మండల వాసులు భయందోళనకు గురయ్యారు.

● వేములవాడ: వేములవాడ పట్టణంలో సోమవారం సాయంత్రం భూమి స్వల్పంగా కనిపించింది. సుమారు మూడు సెకండ్ల పాటు భూమి కనిపించడంతో పట్టణంలో వివిధ ప్రాంతాలలో ఇండ్లు కదిలినట్లు స్థానికులు తెలిపారు. ప్రజలు భయంతో ఇండ్లలోంచి బయటకు వచ్చారు. ఇదిలా ఉండగా సోమవారం రాత్రి వేములవాడలో వర్షం కురిసింది. సుమారు అరగంటకు పైగా వర్షం కురవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఒకవైపు భూమి కంపించడం, మరోవైపు ఆ తర్వాత కొద్దిసేపటికే ఉరుములు మెరుపులతో కూడిన వర్షం రావడంతో ఏం జరుగుతుందో అని ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

● చందుర్తి: చందుర్తి మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో సోమవారం సాయంత్రం భూమి కంపించింది. మండలాల్లో కొన్ని సెకన్ల పాటు స్వల్ప భూప్రకంపనలు సంభవించాయి. దీంతో ప్రజలు భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు పెట్టారు.

● వీర్నపల్లి: వీర్నపల్లి మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో సోమవారం సాయంత్రం భూప్రకంపనలు వచ్చినట్లు ప్రజలు తెలిపారు. దీంతో ఒక్కసారిగా ప్రజలు ఉలిక్కిపడ్డట్లు బయటకు వచ్చి నిల్చున్నారు. ఇంట్లో ఉన్న వంట సామగ్రి, పలు వస్తువులు కింద పడిపోయినట్లు తెలిపారు.

రైతు వేదికను పరిశీలించిన పోలీసులు

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

ఎల్లారెడ్డిపేట, మే 5 (ఆంధ్రజ్యోతి) ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని గిద్దె చెరువు ప్రాంతంలో నిర్మించి నిరుపయోగంగా మారిన రైతు వేదిక, పరిసరాలు, ధ్వంసమైన తలుపులు, కిటికీలను ప్రొబెషనరీ ఎస్ఐ లక్ష్మణ్ సోమవారం పరిశీలించారు. రైతులకు వినియోగంలోకి రాకపోవడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారడంపై ఈ నెల 5న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితం కాగా పోలీసులు సోమవారం స్పందించారు. స్థానిక వ్యవసాయ అధికారి రాజశేఖర్‌తో కలిసి రైతు వేదికను పరిశీలించారు. రైతు వేదిక తలుపులు, కిటికీలు ధ్వంసం పట్ల ఏఈవో శ్రీశైలం ఫిర్యాదు మేరకు గుర్తు తెలియని వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని వివరించారు.

హైకోర్టు న్యాయమూర్తి మృతిపై నివాళి

సిరిసిల్ల క్రైం, మే 5(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ ప్రధాన న్యాయమూర్తి, హైకోర్టు న్యాయమూర్తి ఎం. గిరిజ ప్రియదర్శిని అనారోగ్యంతో మృతిపై సిరిసిల్ల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమ వారం న్యాయవాదులు రెండు నిముషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. కరీంనగర్ జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసినపుడు సిరిసిల్ల, వేములవాడ కోర్టుల పరిధిలో ఆమెతో ఉన్న అనుబంధాన్ని న్యాయవాదులు గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా అన్ని కోర్టు విధులను సస్పెండ్ చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు జూపల్లి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి వెంకటి, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు. మరోవైపు హైద్రాబాద్‌లో ఆమె నివాసంలో ఉంచిన భౌతికకాయానికి సిరిసిల్ల న్యాయవాదులు పుష్పగుచ్ఛంతో నివాళులు అర్పించారు.


వేములవాడలో సంతాపం తెలుపుతున్న న్యాయవాదులు

● వేములవాడ : తెలంగాణ హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ గిరిజ ప్రియదర్శిని మృతి పట్ల వేములవాడ న్యాయవాదులు సంతాపం ప్రకటించారు. వేములవాడ కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో పలువురు న్యాయవాదులు ఆమె మృతి పట్ల నివాళుల ర్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుండ రవి, ప్రధాన కార్యదర్శి గడ్డం సత్యానారాయణరెడ్డి, ఏజిపి బొడ్డు ప్రశాంత్ కుమార్ ఉన్నారు.

పరామర్శ

గంభీరావుపేట, మే 5 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్‌ను కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కొండూరు గాంధీ సోమవారం పరామర్శించారు.హమీద్ సోదరుడు జావీద్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా కొండూరు గాంధీ వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పాపగారి రాజు, పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జి గౌరి శంకర్, మాజీ సర్పంచ్ అక్కపల్లి బాలయ్య, నాయకులు ఉన్నారు.

ప్రజావాణికి స్పందన కరువు

చందుర్తి, మే 5 (ఆంధ్రజ్యోతి): చందుర్తి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి స్పందన కరువైంది. ప్రజావాణికి రెండు దరఖాస్తులు మాత్రమే వచ్చినట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. ఒకటి రేషన్ కార్డు కోసం, ఒకటి ఎంపీడీవో కార్యాలయం సంబంధించిన దరఖాస్తులు వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీఓ రాజయ్య, ఎంపీడీవో జూనియర్ అసిస్టెంట్ రమాదేవి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి సాయం

గంభీరావుపేట, మే 5 (ఆంధ్రజ్యోతి) బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త బరిగెల బాలకిషన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. బీఆర్ఎస్ సభ్యత్వ ఇన్స్‌రెన్స్ చెక్కును వారి కుటుంబానికి నాఫ్స్‌కాప్ ఛైర్మెన్ కొండూరు రవీందర్‌రావు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి, సెస్ డైరెక్టర్ నారాయణరావు, కొత్తపల్లి సింగిల్‌విండో ఛైర్మెన్ సురేందర్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

తంగళ్లపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): రెడ్డి సంఘం ఆధ్వర్యంలో కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి వారు తంగళ్లపల్లి మండలం మండేపల్లి గ్రామంలో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు.

రెడ్డి సంఘం కార్యవర్గం

ఇల్లంతకుంట, మే 5(ఆంధ్రజ్యోతి) మండలంలోని వల్లంపట్ల గ్రామ రెడ్డి సంఘ అధ్యక్షుడు అనుపట్ల రవీందర్‌రెడ్డి ఎన్నికయాడు. సంఘ భవనంలో సోమవారం సమావేశం జరిగింది. ఉపాధ్యక్షుడుగా చల్ల ప్రతాప్‌రెడ్డి, ప్రధానకార్యదర్శిగా తడకమడ్ల రాజిరెడ్డి, కోశాధికారిగా కట్ట శ్రీకాంత్‌రెడ్డి, సహాయకార్యదర్శిగా ఆల్ల జగపతిరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా ఒంటెల వినయ్, ఐరెడ్డి వెంకటరెడ్డి, మండల అడహక్‌కమిటీ సభ్యుడిగా మందాటి కరుణాకర్‌రెడ్డి ఎన్నికయ్యారు.

మండల శాఖ అధ్యక్ష పదవికి తీవ్ర పోటీ

గంభీరావుపేట, మే 5 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట మండల శాఖ బీజేపీ అధ్యక్ష పదవికి తీవ్ర పోటీ ఉంది. బీజేపీ మండల అధ్యక్ష పదవిని పార్టీలోని సీనియర్ నాయకులతో పాటు యువ నాయకత్వం ఆశిస్తోంది. దాదాపు ఈ నెల 5, 6 తేదీలలోపు మండల శాఖ అధ్యక్షుడిని ని యమించే అవకాశం ఉన్నది. పోటీ ముగ్గురు లేదా నలుగురు మధ్య ఉండే ఉంది. బీజేపీ మండల అధ్య పదవి ఆశిస్తున్న వారిలో ప్రసాద్‌రెడ్డి, కోడే రమేష్, రాజేందర్ రెడ్డి, ఎల్ రాజిరెడ్డి, మద్దుల రాజిరెడ్డి, దేవసాని కృష్ణ, కృష్ణకాంత్‌యాదవ్, మహేష్ యాదవ్, బందారపు దేవేందర్, బాషవేణి రవీందర్, మాండ్ల లక్ష్మన్, గంట అశోక్ పేర్లు అధిష్టానం పరిశీలనలో ఉన్నాయి.

అక్రమంగా నివసిస్తున్న వారిని బహిష్కరించాలి


సిరిసిల్ల కలెక్టరేట్, మే 5, (ఆంధ్రజ్యోతి) : భారతదేశంలోకి అక్రమంగా చొరబడి నివసిస్తున్న పాకిస్తానీలను దేశం నుంచి బహిష్కరించాలని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి డిమాండ్ చేశారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్రకమిటీ పిలుపు మేరకు సోమవారం సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌కు బీజేపీ నాయకులతో కలిసి వచ్చి జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝూను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గోపి మాట్లాడుతూ పాకిస్తాన్ మద్దతుతో ఆశ్రయం పొందిన ఉగ్రవాదులు గత నెల 22న పహల్గాంలో దాడికి పాల్పడి 26 మంది అమయాక ప్రజల ప్రాణాలు తీశారన్నారు. పాకిస్తానీయులను దేశంనుంచి తరమి కొట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా పట్టణ అధ్యక్షుడు సుంకరి బాలకిషన్, బీజేపీమహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కర్నే హరీష, జిల్లా ఉపాధ్యక్షురాలు పండుగ మాధ వి, పట్టణ మాజీఅధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, నాయకులు సురేందర్‌రావు, ఊరగొండ రాజు, అంకారపు రాజు, ఇంజపూరి మురళి తదితరులు పాల్గొన్నారు.

● చందుర్తి: పాకిస్తాన్ చొరబాటుదారులను బహిష్కరించాలని బీజేపీ మండల అధ్యక్షులు మొకిలే విజేందర్ అన్నారు. తహసీల్దార్‌కు మండల బిజెపి నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పొంచేట్టి రాకేష్, పత్తిపాక శ్రీనివాస్, హనుమయ్య చారి, మోత్కుపల్లి రాజశేఖర్, చింత కుంటా సాగర్, తీపిరెడ్డి మనోహర్ రెడ్డి, బద్దం తిరుమల్ రెడ్డి, తోట శంకర్, నేతి కుంటా బాలురాజు, శ్రీకాంత్ నాయకులు పాల్గొన్నారు.

● వేములవాడ టౌన్: అక్రమంగా భారతదేశంలోకి వచ్చిన పాకిస్తాన్ దేశస్తులను వెంటనే దేశం నుంచి పంపించాలని బీజేపి మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్ గౌడ్ డిమాండ్ చేశారు. వేములవాడ తహసీల్దార్ కార్యలయానికి మండల బీజేపి నాయకులు సోమవారం తరలివచ్చి డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో లింగంపల్లి శంకర్, చింతపల్లి వెంకటేశ్వర్‌రావు, గుండెకార్ల లక్ష్మణ్, రాజిరెడ్డి, పూర్ణచందు తదితరులు ఉన్నారు.

● ముస్తాబాద్ : భారతదేశంలో ఉన్న పాకిస్థానీయలను దేశం వదిలి వేళ్లేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతి ఆధ్వర్యంలో నాయకులు తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందించారు. మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతి, చిట్నేని శ్రీనివాస్‌రావు, మల్లారెడ్డి, మెంగని మహేందర్, చిగురు వెంకన్న, ఏదునూరి గోపి, పద్మ, కరెడ్ల రమేశ్‌రెడ్డి, కోల కృష్ణ, బాల్‌రెడ్డి, వెంకటేశ్, మహేశ్, మల్లేశం, జనార్ధన్ తదితరులు ఉన్నారు.

● ఎల్లారెడ్డిపేట: పాక్ చొరబాటుదారులను దేశం నుంచి బహిష్కరించాలని ఎల్లారెడ్డిపేట తహసీల్దార్ సుజాతకు బీజేపీ నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రామచంద్రారెడ్డి, బుగ్గారెడ్డి, సంజీవరెడ్డి, సత్యంరెడ్డి, ప్రదీప్‌రెడ్డి, నరేశ్, కిరణ్‌నాయక్, అనూష్, సత్యం పాల్గొన్నారు.


కలెక్టరేట్‌కు తరలివచ్చిన బీజేపీ నాయకులు